క్లుప్తంగా

సెలూన్ షాపులకు ప్రభుత్వ స్థలం కేటాయించాలి



ఎంపీడీఓ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండలంలోని నాయీ బ్రాహ్మణులు క్షవర వృత్తి నిర్వహించుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని మండల అభివృద్ధి అధికారి డి.సురేష్‌బాబుకు నాయీ బ్రాహ్మణ సాధికారత కమిటీ కన్వీనర్ కరేటి నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ సంతనూతలపాడు మండల క్షవర వృత్తిదారుల షాపుల నిర్వహణకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని బీసీ వెల్ఫేర్ అధికారికి ప్రతిపాదనలు పంపిస్తామని మండల అభివృద్ధి అధికారి డి.సురేష్‌బాబు హామీ ఇచ్చారన్నారు. అనాదిగా ఇంటింటికి తిరిగి క్షవర వృత్తి చేసుకుంటూ నేటికీ సమాజంలో చిన్నచూపునకు నాయీ బ్రాహ్మణులు గురవుతున్నారని, సొంత స్థలం కేటాయిస్తే గౌరవంగా జీవితాలను గడిపే ఆస్కారం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల జనరల్ సెక్రటరీ ఎం.ప్రసాద్, గౌరవాధ్యక్షుడు గుంటూరు ప్రసాదు, సంతనూతలపాడు మండల కౌరవృత్తిదారులు పాల్గొన్నారు.



చీమకుర్తిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, నాయకులు



మద్దిపాడులో పార్టీ జెండా ఎగురవేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, నాయకులు

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

చీమకుర్తి:

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం చీమకుర్తిలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ ఆవిర్భావం నాటి మధురమైన క్షణాలను గుర్తు చేసుకున్నారు. పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి తీసుకురాగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: మద్దిపాడులోని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ జెండాను మాజీ మంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భవించి 14 సంవత్సరాలు పూర్తిచేసుకుని 15వ సంవత్సరంలోకి అడుగుపెడుతోందని మేరుగు నాగార్జున తెలిపారు. బలమైన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరం పార్టీ కోసం కష్టపడదామని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు, కుల, మత, పార్టీ, ప్రాంతీయ విభేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిన విషయాన్ని గుర్తుచేశారు. నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉందన్నారు. పోరాటాల్లో పుట్టిన వైఎస్సార్ సీపీని అందరం కలిసి బలోపేతం చేసి మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ఒంగోలులో చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. కార్యక్రమంలో సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాగులుప్పలపాడు మండల అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, పోలినేని కోటేశ్వరరావు, మద్దిపాడు మండల కార్యదర్శి వాకా కోటిరెడ్డి, సీనియర్ నాయకులు కంచర్ల సుధాకర్, మండల బాలచంద్రమౌళి, నాదెండ్ల మహేష్, సురేష్, ప్రసాద్, పైనం ప్రభాకర్, డేనియల్, చిట్టిబాబు, కొమ్మూరు సుధాకర్, సింగయ్య, రజని, సంధ్య, శ్రీనివాసరావు, దుడ్డు వినోద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఒంగోలు టౌన్: మరణించిన డీపీఓ సిబ్బందికి పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ భరోసా ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన సత్యం సతీమణి రజనీ ప్రియకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాలరీ ప్యాకేజీ పథకం కింద రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సత్యం కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడారు. కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలను వీలైనంత త్వరగా అందజేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవాలని, పోలీసు శాఖ అండగా ఉంటుందని చెప్పారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డీపీఓ పి సెక్షన్ సూపరెండెంట్ యాస్మిన్ బాను, బ్యాంక్ ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ ఎస్‌కే కిరణ్‌రెడ్డి, ఆర్‌బీడీ ఎం డి. అశోక్ కుమార్, మార్కాపురం బ్రాంచి మేనేజర్ పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



శాలరీ చెక్కును అందజేస్తున్న ఎస్పీ దామోదర్



ఒంగోలులో యువత పోరు కార్యక్రమం అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి, కసుకుర్తి ఆదెన్న, చుండూరి రవిబాబు, దద్దాల నారాయణయాదవ్, కాకుమాను రాజశేఖర్, వైఎం ప్రసాద్‌రెడ్డి, తదితరులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చుండూరు రవిబాబు, నాయకులు

యువత పోరుకు భారీగా వైఎస్సార్ సీపీ శ్రేణులు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి చీమకుర్తి మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు క్రిష్ణపాటి శేఖర్‌రెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, నాయకులు మన్నం శ్రీధర్, ఎస్.భాస్కర్‌రెడ్డి, ఓబులరెడ్డి, కూరారుల రాఘవరెడ్డి, సుబ్బారెడ్డి, కత్తి రమణారెడ్డి, బొడ్డు కోటేశ్వరరావు, పమిడి తిరుపాలు, యర్రగుంట్ల వసంతరావు, మోహన్, చెంచారావు, బూతలపల్లి కోటయ్య, నాగార్జునరెడ్డి, మెక్కెన రాజేంద్ర, పి.నాగేశ్వరరావు, చీదర్ల శేషు, కుంచాల రాంబాబు, పి.నాగేశ్వరరావు, సంతోష్, గండి రోశయ్య, పేరయ్య, సామ్యేలు, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి, బెల్లం వెంకటరావు, సుందరరామిరెడ్డి, మొగిలిచెట్టి వెంకటేశ్వర్లు, టి.గాంధీ, జంషీర్, బాషా, మార్క్ యల్లయ్య, ససర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో కలిసి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మండల నాయకులు

కొత్తపట్నం మండలం నుంచి...

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి కొత్తపట్నం మండల నుంచి పార్టీ శ్రణులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలకు పార్టీ జెండాలు కట్టుకుని కేరింతలు కొడుతూ ఒంగోలు నగరానికి చేరుకున్నారు. ఒంగోలులో పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని కలిసి మండలంలోని వివిధ సమస్యలను వివరించారు. అనంతరం యువత పోరు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్తపట్నం మండలం నుంచి తరలివెళ్లిన వారిలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలి భర్త సైకం రాంబాబు, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఉప్పుటూరి కోటేశ్వరరావు, సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, సామంతుల వీరారెడ్డి, ద్వారం మురళి, సంజీవరావు, గాదె కోటిరెడ్డి, ముసలారెడ్డి, మూగ బాలాజీ, తదితరులు ఉన్నారు.



వైఎస్సార్ సీపీ యువత పోరు ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా కార్యకర్తలు



చీమకుర్తి నుంచి యువత పోరుకు ఒంగోలు తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఇన్ఫోసిస్ శిక్షణకు క్విస్ విద్యార్థులు

ఒంగోలు సిటీ: ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు హాజరయ్యారు. క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్ఈ మూడో సంవత్సరం చదువుతున్న కొండా శ్రీ కావ్య, కొణిజేటి శ్రీ వైష్ణవి, బొగ్గవరపు ప్రణవి, మేడిశెట్టి వెంకట మన్విత, మద్దిరాల ప్రణీత, కాట్రగడ్డ సుప్రియ ఎంపికై మూడు నెలల పాటు శిక్షణ పొందారు. దేశ వ్యాప్తంగా హైదరాబాద్ క్యాంపస్‌లో 450 మంది ఈ కార్యక్రమంలో పాల్గొనగా క్విస్ కళాశాల నుంచి పై ఆరుగురు ఎంపికయ్యారు. 18 ఏళ్లకు పైబడిన ఆడవారికి వివిధ అంశాల్లో నైపుణ్యం ఇచ్చేందుకు ఇన్ఫోసిస్ ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని చేపట్టింది. ఆన్‌లైన్ ద్వారా 2.5 నెలలు వివిధ టాస్కులు, అసైన్మెంట్లు పెట్టి వాటిని సకాలంలో పూర్తి చేసిన వారికి చివరి వారం రోజులు హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో శిక్షణ అందించారు. ఇంటర్వ్యూ స్కిల్స్, స్ట్రెంత్ వీక్‌నెస్ అపర్చునిటీస్ త్రెట్స్ (ఎస్‌డబ్ల్యూఓటీ) రీసెర్చ్‌కి ఉపయోగపడే విధంగా రీడింగ్ కొచ్ లాంటి వాటిల్లో శిక్షణ అందించారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులను క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి అభినందించారు. విద్యార్థులు అసైన్మెంట్లు పూర్తి చేసి ఇన్ఫోసిస్ వారు పెట్టిన రెండు పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆ ప్రోగ్రాంకి ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందని, సదరు ప్రోగ్రామ్ సర్టిఫికెట్, అక్కడ నేర్చుకున్న స్కిల్స్ వారికి ఎంతగానో ఉపయోగపడతాయని క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, సీఎస్ఈ హెచ్‌వోడీ డాక్టర్ బుజ్జిబాబు అన్నారు.



ఇన్ఫోసిస్ శిక్షణ పొందిన క్విస్ కాలేజీ విద్యార్థులు

మహిళా ఖైదీలు, పిల్లలకు న్యాయ సహాయం

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు సిటీ: జైలు జీవితం అనుభవిస్తున్న మహిళా ఖైదీలతో పాటు, వారి పిల్లలకు న్యాయ సహాయం అందేలా చూడాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అధికారులకు సూచించారు. జిల్లా జైలును బుధవారం ఆమె సందర్శించారు. మహిళా విభాగంలో మహిళలను వారి కేసుల గురించి, వారి కుటుంబ స్థితిగతులను, వారి పిల్లల ఆరోగ్యం, చదువు గురించి అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీ ఒకరు గర్భిణిగా ఉండడం గుర్తించి తగిన మందులు అందించి, పుట్టబోయే బిడ్డకు, తల్లికి వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. మరొక మహిళా ఖైదీ వద్ద ఐదేళ్లు నిండి మానసికంగా, శారీరకంగా ఎదుగుదల లేని బాలుడిని గుర్తించి, ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్‌వైజర్, అంగన్‌వాడీ వర్కర్లను పిలిపించి సత్వరం గర్భిణులకు అందించే పౌష్టికాహారం, పిల్లలకు అందించే ప్రత్యేక ఆహారాన్ని గుడ్లను వారికి అందించి వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి ఆదేశించారు. మహిళా ఖైదీలు వారి పిల్లలకు సంబంధించిన అన్ని వివరాలు, స్కూలుకు వెళుతున్న సంగతులను సంబంధిత సీడీపీవో ద్వారా కమిషన్ కు ఎంక్వయిరీ చేసి రిపోర్ట్ అందజేయాలని ఆదేశించారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ ద్వారా ఖైదీల వివరాలు తెలుసుకుని వారికి తగిన న్యాయ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో పి.వరుణరెడ్డి, సూపరింటెండెంట్ వసంతరావు, జైలర్, లీగల్ కం ప్రొఫెషన్ ఆఫీసర్ బీ రత్న ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



ఖైదీల నుంచి వివరాలు తెలుసుకుంటున్న బత్తుల పద్మావతి

సంక్షిప్తంగా

ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో సమీక్ష



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు: ఉపాధి హామీ పథకం ప్రోగ్రెస్‌పై ఎంపీడీవో డి.సురేష్‌బాబు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలానికి 300 సోక్ పిట్లు మంజూరవగా 172 మాత్రమే ప్రారంభించారని, మిగిలిన వాటిని కూడా వెంటనే ప్రారంభింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. ప్రతిరోజూ కూలీలు పనులకు వచ్చేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. క్యాటిల్ షెడ్ల ప్రోగ్రెస్ పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, ఈసీ బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు సర్వేలను పరిశీలించిన ఎంపీడీవో...

సంతనూతలపాడు రెండో సచివాలయం పరిధిలో గల ఆశ్రమం బజారులో సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న పీ4, ఎంఎస్ఎంఈ వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను బుధవారం ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు. చిన్న పరిశ్రమలు, ఉన్నత విద్యాభ్యాసం చేసి ఖాళీగా ఉన్న 18 నుంచి 50 సంవత్సరాల్లోపు వారి వివరాల సేకరణ వంటివాటిని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రతాప్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల అక్రమాలపై విచారణ

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఎల్ఈడీ విద్యుత్ వీధి దీపాలను అధిక ధరకు కొనుగోలు చేశారనే ఆరోపణలపై బుధవారం ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ హనుమంతరావు విచారణ చేశారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు 2021వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఎల్ఈడీ విద్యుత్ వీధి దీపాలను అధిక ధరకు కొనుగోలు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారని బీజేపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు చెన్నుపల్లి వెంకటరమణ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు కనిగిరి డీఎల్‌పీఓ హనుమంతరావును విచారణ అధికారిగా నియమించారు. ఆయన బుధవారం మద్దిపాడు గ్రామ సచివాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై రికార్డులు పరిశీలించి విచారణ చేపట్టారు.

విద్యార్థులు క్రమశిక్షణతో కొత్త విషయాలు నేర్చుకోవాలి



అతిథి ఉపన్యాసమిస్తున్న గణిత అధ్యాపకుడు మాణిక్యరావు

ఒంగోలు సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో కొత్త విషయాలు నేర్చుకోవాలని గణిత అధ్యాపకుడు డాక్టర్ సీహెచ్ మాణిక్యరావు సూచించారు. బుధవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్ మాణిక్యరావుచే ఇంట్రడక్షన్ టు క్రిప్టోగ్రఫీ అనే అంశంపై అతిథి ఉపన్యాసం ఏర్పాటు చేశారు. 28 సంవత్సరాల అధ్యాపక అనుభవం, పరిశోధనాత్మక అనుభవం కలిగిన మాణిక్యరావు వారి అనుభవాన్ని, పరిశోధనాత్మకతను క్రోడీకరించి గణిత శాస్త్ర అనువర్తనాలు క్రిప్టోగ్రఫీలో ఏయే అంశాలలో విస్తరించి ఉన్నాయో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కే కేజీయ, అధ్యాపకురాలు బి.శ్రావణి, ఎస్.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

16న గాయత్రీ హోమం



సెగ్గం శ్రీనివాసరావుకు నగదు, బియ్యం అందిస్తున్న ఆనం ఆషారావు, జిల్లెలమూడి రమాదేవి

ఒంగోలు మెట్రో: హరిద్వార్‌లో 108 సంవత్సరాలుగా వెలుగొందుతున్న అఖండ దీపాన్ని భక్తుల సందర్శనార్థం యర్రగొండపాలెం కొలుకుల గ్రామంలోని రామాలయానికి తీసుకొస్తున్న సందర్భంగా 108 హోమ గుండాలతో ఈ నెల 16వ తేదీ గాయత్రి హోమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పూజా ద్రవ్యాల కోసం ఆనం ఆషారావు రూ.50 వేలకై ఏకర్యముగా సమర్పించారు. భక్తులకు భోజన సదుపాయాలకు జిల్లెలమూడి రమాదేవి 10 క్వింటాల బియ్యంను బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావుకు బుధవారం అందించారు. హోమం నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ సహకార్యదర్శి యక్కలి రాఘవులుకు వాటిని పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయపాటి అజయ్ కుమార్, మాకినేని అమరసింహం, బొడ్డులూరి ఆంజనేయులు, దండు శ్రీనివాసరావు, కాటా రాధాకృష్ణ, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుసాగును వ్యవసాయ రంగంలోకి మార్చాలి



ఉప్పు కొటారు భూముల్లో కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

కొత్తపట్నం: ఉప్పుసాగును వ్యవసాయ రంగంలోకి మార్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బుధవారం కొత్తపట్నంలో ఉప్పు కొఠారులను సందర్శించారు. పొలాల్లో పనిచేస్తున్న ఉప్పు కార్మికులతో స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఉప్పు కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికిచ్చిన సబ్సిడీ పథకాలు, రైతు భరోసా, రుణమాఫీ వంటివి తమకు చెందటం లేదని, తమకు పట్టాలు ఇచ్చే రేగానీ ఆన్‌లైన్ మాత్రం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ అమలు చేయాలని, రోడ్లు, రక్షణ కట్టలు వంటి మౌలిక వసతులు లేక ఎన్నో ఏళ్ల నుంచి నష్టపోతున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లులు రూ.5 వేలకుపైగా వస్తున్నాయని, ప్రస్తుతం ఉప్పు ఉత్పత్తి అనేది పరిశ్రమ కింద ఉందని, పరిశ్రమ కింద కాకుండా వ్యవసాయం కిందకు మారిస్తే ప్రభుత్వ పథకాలన్నీ వర్తిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి బి.బాలకోటయ్య మాట్లాడుతూ ఉప్పు రైతులకు గిట్టుబాటు ధర ప్రభుత్వమే కల్పించాలని, ప్రభుత్వమే ఉప్పు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మన జిల్లాలో ఉప్పు వాడే పరిశ్రమ ఒకటి ఏర్పాటు చేస్తే ఉప్పుకు మంచి డిమాండ్ పలుకుతుందని తెలిపారు. పరిశ్రమ ఏర్పాటు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఉప్పురైతులంతా ఐక్యంగా ఉండి మన సమస్యల గురించి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఉప్పు భూముల్లో వచ్చే మేటను తొలగించేందుకు ఎన్ఆర్ఈజీఎస్‌లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి, ఉప్పు కార్మికులు ఎన్.ఆంజనేయులు, కె.శ్రీను, కె.శ్రీరాములు, టి.నాగార్జున్, రఘు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న



జయరాంను సత్కరిస్తున్న శివం ఫౌండేషన్ నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం అన్నారు. బుధవారం ఒంగోలు అన్నవరప్పాడులోని శివం శరణాలయాన్ని ఆయన సందర్శించారు. శరణాలయం నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న అనాథలకు పండ్లు, వస్త్రాలను జయరాం పంపిణీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నిరుపేదలైన వెంకటేశ్వర్లు, చిట్టెమ్మల కంటి ఆపరేషన్లకు రూ.20 వేలు అందజేశారు. కోమటి జయరాంను శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి సత్కరించారు. కార్యక్రమంలో ఒంగోలు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారెళ్ల వివేకానంద, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మాదాల కోటేశ్వరరావు, అనిత దంపతులు, వద్దినేని రామాంజనేయులు, మండవ రమ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి

ఒంగోలు టౌన్: నగరంలోని బిలాల్ హోటల్లో బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఏడాదిలో ఒక మాసం ఆధ్యాత్మిక సేవలో గడపడం వలన మానసికంగా, శారీరకంగా ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున ముస్లింలకు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ లియాఖత్, సింగరాయకొండ, ఒంగోలు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి మూలవిరాట్

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, 14వ తేదీ గ్రామోత్సవం, 15వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీనివాస కళ్యాణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, 16న హనుమంత వాహనసేవ, వసంతోత్సవం ఉంటాయని చెప్పారు. భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.